## దండేపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం


అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

దండేపల్లి, మార్చి11 : జగిత్యాల జిల్లా సారాంగపూర్ మండలం నగునూరు గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన వారిని కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం దండేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి.. మాట్లాడారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోళ్ల రాజమల్లు, అంబేద్కర్ మండల అధ్యక్షుడు లింగపెల్లి బాపు, అట్రాసిటీ జిల్లా సభ్యులు బచ్చల అంజన్న, గాలిపెల్లి శేఖర్, రమేశ్, తిరుపతి, సత్యం, నవీన్. జనార్దన్, ప్రవీణ్ ఉన్నారు.

## మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

### కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే


సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాను సన్మానిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చ్ 11 : మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణత శాతం తగ్గుతూ వస్తున్నదని, ఈసారి వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, సీడీపీవోలు పాల్గొన్నారు.

జైపూర్ మండలం ఇందారం గ్రామంలో నీరు లేక ఎండిపోతున్న పంటలు



# అడుగంటిన జలాలు

# ఎండుతున్న పంటలు

## కాంగ్రెస్ తెచ్చిన కరువు

- రామారావుపేట పెద్ద చెరువులో అడుగంటిన నీరు
- బోరు బావుల్లో పాతాళానికి చేరిన నీటి మట్టం
- సరిపడా నీరందక ఎండిపోతున్న పంటలు

### జైపూర్ మండలంలోని ఇందారం, టేకుమట్ల గ్రామాల్లో దయనీయ స్థితి

### ఐదు రోజులుగా నీళ్లు లేవ్..

*నా పేరు బల్ల రాజు. బోర్ల కింద దాదాపు 25 ఎకరాలు సాగు చేసిన. బోర్లలో నీరు లేక పంట ఎండిపోతున్నది. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఐదు రోజులుగా ఉన్న కొద్దిపాటి నీళ్లను కూడా పొలానికి పెట్టడం కుదరడం లేదు. నేను కరంటోళ్ల చుట్టూ తిరుగుతుంటే పొలం ఉల్లారే దశకు వచ్చింది. దాదాపు ఎకరం పొలం ఇప్పటికే ఎండిపోయింది. మా చుట్టు పక్కన పొలాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకున్నది. సర్కారు స్పందించి రైతులకు న్యాయం చేయాలి. పంటలకు సాగునీరు అందేలా చేయాలి.*

**- బల్ల రాజు, రైతు, టేకుమట్ల.**



మంచిర్యాల, మార్చి 11(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని ఇందారం, టేకుమట్ల గ్రామాల్లో సాగు నీరందక వందల ఎకరాల్లో పంటలు ఎండిపోయే దుస్థితి నెలకున్నది. చెరువులు ఎండిపోయి, బోర్లలో నీరు లేక వరి సాగు చేసిన రైతులు అవస్థలు పడుతున్నారు. ఇందారం పక్కప ఉన్న రామారావుపేట పెద్ద చెరువులో నీరు అడుగంటిపోవడంతో ఇందారం, రామారావుపేట గ్రామాల్లో చెరువు కింద సాగయ్యే పొలాలకు నీరు అందడం లేదు. పొలాల్లో నీరు కనిపిస్తున్న చెరువు నుంచి వచ్చే కాలువలో నీటి ఫ్లోటింగ్ లేదు. దీంతో వరి పైరు ఎండిపోవడం మొదలైంది. దాదాపు నెలన్నర రోజులు చెరువు నుంచి నీరు వచ్చిందని గడిచిన వారం, పది రోజులుగా నీరు రాక పంట తడవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే గోదావరి ఉన్న అందులోనూ నీళ్లు లేవని రెండేళ్ల క్రితం గోదావరి నిండుకుండలా ఉండి, మా చెరువులో నీరు ఉండడంతో రెండు పంటలకు ఢోకా లేకుండా సాగు చేసుకునే వారిమని రైతులు అంటున్నారు. రామారావుపేట పెద్ద చెరువు కింద దాదాపు 350 ఎకరాల్లో వరి సాగు చేయగా చెరువులో నీరు లేక ఎండిపోవడం మొదలైంది. మరో నెల రోజులపాటు నీరు సరఫరా చేయకపోతే పంట మొత్తం ఎండిపోవడం ఖాయమని రైతులు చెప్తున్నారు. వారం, పది రోజుల్లో భూములన్నీ నెర్రలువారి పొట్ట దశకు వచ్చిన పంట ఎండిపోక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అటు గోదావరి, ఇటు చెరువుల్లో నీరు లేక మండలంలో టేకుమట్ల గ్రామంలో బోర్ల కింద సాగు చేసే వరి పంటలకు నీరు అందడం లేదు. భూగర్భ జలాలు అడుగంటి పోయాయని, గంట సేపు బోరు నడిస్తే మరో గంట సేపు ఆపేయాల్సి వస్తుందని రైతులు చెప్తున్నారు. ఇచ్చే 18 గంటల కరెంట్‌లో ఏడు, ఎనిమిది గంటలు బోరు నడిపినా.. పంట మొత్తం తడవడం లేదని వాపోతున్నారు. పైపులు మార్చుకుంటూ, అటూ ఇటూ తిప్పుకుంటూ కావలి కాసి నీరు అందిస్తే ఎకరం తడవడానికి రెండు రోజుల సమయం పడుతుందంటున్నారు. ఇప్పటికైనా సర్కారు స్పందించి మా పంటలు ఎండిపోకుండా నీరు అందించాలని, లేనిపక్షంలో పంట ఎండిపోయిన రైతులు ఎకరానికి రూ.30 వేల చొప్పున నష్టపోక తప్పదని తమ కష్టాలను చెప్పుకుంటున్నారు.

నీరు లేక ఎండిపోతున్న ఇందారం సమీపంలో రామారావుపేట పెద్ద చెరువు



### ఖర్చులు కూడా ఎల్లేట్టు లేవ్..

*రామరావుపేట పెద్ద చెరువు కింద ఇందారం శివారు లో ఐదెకరాల వరి వేశా. పంట వేసి రెండు నెలలు అవుతున్నది. యాసంగి సాగు మొదలుపెట్టేప్పుడు చెరువు నిండుగా నీరు ఉండే. పక్కనున్న గోదావరిలో నీళ్లు లేక భూగర్భ జలాలు అడుగంటి చెరువు ఎండి పోవటానికి వచ్చింది. దీంతో నీరు పార కానికి సరిపోక పొలం ఎండిపోయే దశలో ఉంది. ఇప్పటికే ఎకరం దాకా నెర్రెలు పారింది. ఐదెకరాలు వేసంగిలో నాట్లు వేయడానికి రూ.1.25 లక్షల వరకు ఖర్చు వచ్చింది. పంట పండుతుందన్న ఆశ లేదు. ఖర్చులు కూడా ఎళ్లని పరిస్థితి ఉంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.*

**- గడ్డం సందీప్, యువరైతు, ఇందారం.**



## విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలి

### కేజీబీవీని సందర్శించిన కలెక్టర్ కుమార్‌దీపక్

జైపూర్, మార్చి 11 : విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. జూనియర్ కళాశాల భవనాన్ని పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం వసతిగృహ వంట గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రసూల్‌పల్లి, నర్వ, టేకుమట్ల, కిష్టాపూర్ గ్రామాల గుండా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనుల పురోగతిని పరిశీలించారు. టేకుమట్ల వద్ద రైతులతో మాట్లాడారు. భూసేకరణ వేగవంతం చేసి రోడ్డు పనులు ప్రారంభించాల్సిన సమయంలో రైతులు పంటలు వేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిహారం డబ్బుల పరిష్కారం తేలాకే పంటలు వేయడం ఆపుతామని రైతులు కలెక్టర్‌తో మొరపెట్టుకున్నారు. హైవే నిర్మాణంలో ప్రభుత్వం రైతులకు ఇస్తున్న పరిహారంపై సంతృప్తి చెందని టేకుమట్ల రైతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో బాపురావు ఉన్నారు.

#### విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ

మంచిర్యాల అర్బన్, మార్చి 11 : రాజీవ్‌నగర్‌లో గల కేజీబీవీ పాఠశాలలోని 20 మంది విద్యార్థులకు కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 568 పాఠశాలలు, 164 రెసిడెన్షియల్ పాఠశాలల్లో 8 ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 1274 మంది విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించామని, వీరికి కంటి వైద్య నిపుణులు యశ్వంతరావు, చంద్రబోస్, శిల్ప, ఆప్తాల్మిక్ అధికారులు శంకర్. భాస్కర్ రెడ్డి పరీక్షలు నిర్వహించారని, ఆ మేరకు 1241 మంది విద్యార్థులకు అద్దాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్, ఉపజిల్లా వైద్యాధికారి డాక్టర్ అనిత, నోడల్ ఆఫీసర్ డాక్టర్ యశ్వంతరావు, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కృపాబాయి, వైద్యాధికారులు డాక్టర్ అశోక్, డాక్టర్ శ్వేత, ఆప్తాల్మిక్ అధికారి శంకర్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ప్రిన్సిపాల్ స్వప్న పాల్గొన్నారు.


జైపూర్ కేజీబీవిలో భోజనాన్ని పరిశీలిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్

## గ్రూప్-2 ఫలితాల్లో మనోళ్ల సత్తా

- గంపలపల్లి వాసికి ఏడో ర్యాంకు
- వరుసగా నాలుగు ఉద్యోగాలు సాధించిన అశోక్
- తలోడికి చెందిన సాయిరాం గౌడ్‌కు ముచ్చటగా మూడు జాబ్‌లు

మంచిర్యాల, (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ లక్షెట్టిపేట, మార్చి 11: గ్రూప్-2 ఫలితాల్లో మనోళ్లు సత్తాచాటారు. లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని గంపలపల్లి గ్రామానికి చెందిన కిష్టయ్య-దేవక్క దంపతుల కుమారుడు గొడ్డేటి అశోక్ 7వ ర్యాంక్ సాధించాడు. 2024లో నవంబర్‌లో గ్రూప్-4 ఉద్యోగం సాధించి మంచిర్యాల కలెక్టరేట్‌లో పే అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం చేస్తున్న ఈయనకు 2018లోనే ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా, పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగాలు వచ్చాయి. ఇది ఈయనకు వరుసగా నాలుగో ఉద్యోగం. దాదాపు ఏడేళ్లు కష్టపడి గ్రూప్-2 ఉద్యోగం సాధించానని, తన ర్యాంక్‌కు జోన్-1లో డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం వచ్చే అవకాశముందని అశోక్ తెలిపారు. అశోక్ గ్రూప్-2 సాధించడంపై గ్రామస్తులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


గొడ్డేటి అశోక్


కామ్రే భాస్కర్


సాయిరాం గౌడ్

#### ముచ్చటగా మూడు ఉద్యోగాలు..

కౌటాల, మార్చి 11 : కౌటాల మండలం తలోడి గ్రామానికి చెందిన మండల రాజేశం గౌడ్-తారక్కల(గీత కార్మికుడు) కుమారుడు సాయిరాం గౌడ్ గ్రూప్-2 ఫలితాల్లో 191వ ర్యాంకు సాధించాడు. 2019లో మొదటి ప్రయత్నంలోనే జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం బెజ్జూర్ మండలం మొగవెల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. 2024లో గ్రూప్-4లో రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం రాగా, జాబ్‌కు పోకుండా గ్రూప్-2కు ప్రిపేర్ అవుతూ వచ్చాడు. తాజాగా గ్రూప్-2 ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. ముచ్చటగా మూడు ఉద్యోగాలు సాధించిన సాయిరాం గౌడ్‌ను తల్లి తండ్రులు, గ్రామస్తులు, తోటి మిత్రులు, పలువురు సాయిరాం గౌడ్‌ను అభినందించారు.

#### సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూనే..

రెబ్బెన, మార్చి 11: గ్రూప్-2 ఫలితాల్లో కౌటల మండలం గుడ్లబోరి గ్రామానికి చెందిన కామ్రే భాస్కర్ రాష్ట్ర స్థాయిలో 381.065 మార్కులతో 229 ర్యాంక్ సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన భాస్కర్ 2016లో సింగరేణి సంస్థలో ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం బెల్లంపల్లి ఏరియా స్టోర్స్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గోలేటిటౌన్‌షిప్‌లోని గ్రంథాలయంలో చదువుకొని ప్రస్తుతం గ్రూప్-2 ఉద్యోగం సాధించాడు.

## ప్రముఖ వైద్యురాలు శృతి గోలికి సన్మానం


డాక్టర్ శృతి గోలిని సన్మానిస్తున్న వాసవీ వనిత క్లబ్ సభ్యులు

మంచిర్యాల అర్బన్, మార్చి 11 : జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో మంచిర్యాల వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య రంగంలో ఉత్తమ సేవలు అందిస్తున్న బర్త్‌రూట్ హాస్పిటల్ వైద్యురాలు శృతి గోలిని సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలు మల్యాల సంగీత, సెక్రటరీ కే.గాయత్రి, కోశాధికారి గుండా సునీత పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు

మంచిర్యాల అర్బన్, మార్చి 11 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రమోద్ రావు తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. కాగా, తోటి ఉపాధ్యాయురాలి పట్ల అసభ్యకరంగా వ్యవహరించినందుకుగాను ఇదే ప్రిన్సిపాల్‌పై ఈ నెల 6న రామకృష్ణపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.